క్లుప్తంగా

ఘనంగా ఎస్సార్ రంగనాథన్ జయంతి

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ జయంతిని స్థానిక గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం రంగనాథన్ ఎంతో పాటు పడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు శ్రీదేవి సూచించారు. మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జనావాసాల మధ్య మురుగునీటి కుంటలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉండటం వలన దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమలకు ఆవాసాలను నిర్మూలించాలన్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వలేని ఆహార పదార్థాలను తినాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు గ్రామస్తులకు సూచించారు. శనివారం మండలంలోని సాల్మన్‌సెంటర్, గాంధీనగర్ గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను బుట్టల్లో వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్యచెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలందరు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

దరఖాస్తు చేసిన నెలలోపే కనెక్షన్



విద్యుత్ కనెక్షన్‌లపై మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు

మేదరమెట్ల: అప్లికేషన్ పెట్టిన నెలలోపే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో రైతులతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ నూతన విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 70 మంది రైతులు వ్యవసాయ విద్యుత కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. వ్యవసాయ సీజన్ ఆరంభమయ్యే లోపు కనెక్షన్‌లు అవసమైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారుడికి నెలలోపే విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

- అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రైతు భరోసా కేంద్రాలతో విప్లవం
- రాయితీపై యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, విత్తనాల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

దండగ నుంచి పండగ వరకు..



కొండమూరు ఆర్బీకే వద్ద యంత్ర పరికరాలు అందుకుంటున్న రైతులు (ఫైల్)

జే.పంగులూరు:

గత ప్రభుత్వ పాలకులు వ్యవసాయం దండగ అన్నారు.. కేవలం ఆకాశ హార్మ్యాలు, గ్రాఫిక్స్‌లు, ప్రచార ఆర్భాటాలు, అబద్ధపు ప్రచారాలతో రైతులను, ప్రజలను నట్టేట ముంచారు. 'రుణమాఫీ చేస్తామని ప్రకటించి చివరికి మేం ఎప్పుడు అన్నాం ..' అని పచ్చి అబద్ధపు మాటలతో మోసం చేసిన ప్రభుత్వాలను చూశాం. కానీ నాలుగున్నర సంవత్సరాలుగా పరిస్థితి మారింది. ప్రతి ఏడాది పచ్చని పంటలతో.. గిట్టుబాటు ధరలతో రైతన్నలు తలెత్తుకునేలా చేశాడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని చేసి చూపించిన నాయకుడు సీఎం జగన్. రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ యంత్రసేవా, కస్టం హైరింగ్ సెంటర్లు, వైఎస్సార్ రైతు భరోసా.. ఇలా ఒకటేమిటి పదుల సంఖ్యలో రైతన్నలకు, పాడి రైతులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి పాటుపడ్డారు. భూమిని నమ్ముకున్న రైతన్నలు సంతోషంగా ఉంటేనే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని జగనన్న ప్రభుత్వం నమ్మి రైతు సంక్షేమం కోసం పాటు పడుతోంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో లాభాల సాగు చేయాలని ఉద్దేశంతో అన్ని విధాల అండగా ఉంటుంది. ఈనాలుగేళ్లలో సాగుకు పెట్టుబడి సాయం అందించింది. సాగునీటి వనరులు అందించటానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి గ్రామానికి రైతు భరోసా ఏర్పాటు చేసి రైతుకు కొండంత అండగా నిలుస్తోంది.



పంగులూరులో మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం (ఫైల్)



జనకవరంలో సబ్సిడీపై ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

రూ. 20.74 కోట్ల రైతు భరోసా సాయం..

రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా 7543 మంది రైతుల ఖాతాలకు 2019 నుంచి ఐదు విడతలుగా రూ. 20.74 కోట్ల సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం జమచేసింది. మండలంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 14 రైతు భరోసా కేంద్రాల్లో 14 రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు తదితర యంత్రాలు పంపిణీ చేసింది.

రైతులకు చేదోడు వాదోడుగా సలహా మండళ్లు..

మండలంలోని 21 గ్రామాలకు గాను 14 రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రధానంగా మిరప, ప్రత్తి, మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటలు కూడా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అనేక సేవలు అందుబాటులోకి తెచ్చింది. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన శాఖ సిబ్బందిని నియమించింది. ప్రతి గ్రామంలో రైతులకు నాణమైన సేవలు అందించటానికి వ్యవసాయ సలహామండలితో పాటు, మండల స్థాయి కూడా ఏర్పాటు చేసింది. ప్రతి నెల మొదటి శుక్రవారం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతుల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహిస్తుంది. ఆ నెలలో రైతులకు అందించాల్సి సేవలపై చర్చించి, పాధాన్యతలను బట్ట ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. రెండో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించి, గ్రామాల నుంచి వచ్చిన అంశాలపై చర్చించి మండల స్థాయి ప్రణాళిక సిద్ధం చేస్తారు.

మాటిచ్చిన ప్రకారం పెట్టుబడి సాయం..



నాడు పాదయాత్రలో మాటిచ్చిన ప్రకారం సీఎం జగన్ రైతులకు పెట్టుబడి సాయాన్ని 2019 నుంచి ఐదు సార్లు అందించారు. రైతుల కష్టాన్ని తెలుసు కొని ఈ ఏడాది తొలి విడతలోని ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఖాతాలకు జమచేశారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏటా అందిస్తున్న సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– రైతు సుబ్బారెడ్డి, కొండమూరు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



రైతు మిత్ర గ్రూపుల కింద ట్రాక్టర్ తీసుకున్నాం. మొత్తం రూ. 8.64, లక్షలకు గాను ప్రభుత్వం రూ. 3.40 లక్షలు రాయితీ ఇచ్చింది. ట్రాక్టర్ చేతిలో ఉండటంతో తక్కువ ఖర్చుతో చిన్న, సన్న కారు రైతులం అంతా సకాలంలో పొలాన్ని దున్నుకుటున్నాం. వ్యవసాయ యంత్రాలతో పని బాగా పెరిగింది. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రైతు దేవేంద్ర, జనకవరం

రైతులకు సత్వరమే సేవలు..



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు లోగడ రైతులు దగ్గరలో ఉన్న టౌన్‌కో మండల కేంద్రాలకో వెళ్లి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అన్ని రైతు భరోసా కేంద్రంలో అందిస్తున్నాం. రైతులకు వ్యసాయానికి కావాల్సిన సమాచారం అంత ఇక్కడే లభిస్తుంది. ప్రభుత్వ పథకాలు యంత్రాలు, విత్తనాలపై సబ్సిడీలను త్వరితగతిన అందిస్తున్నాం.

– సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి

విద్యుత్ సమస్యలకు పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగించనున్నట్లు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శనివారం స్థానిక 19వ వార్డు పెరికపాలెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ స్థానికులకు కరెంట్ సమస్యలు తీరినట్లే అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మేష్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కాలజ్ఞానం ప్రచారం చేసింది ఈశ్వరీయ అమ్మవారే



మఠాధిపతిని సత్కరిస్తున్న పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

అద్దంకి రూరల్: బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలను ప్రచారం చేసింది ఆయన మనుమరాలు ఈశ్వరీదేవి అని బ్రహ్మగారి మఠంలో ఉన్న ఈశ్వరీదేవి మఠాధిపతి శివకుమారస్వామి అన్నారు. శనివారం మండలంలోని శింగరకొండ క్షేత్రంలోని ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలకు పూర్తిస్థాయిలో ప్రచారం కల్పిస్తామన్నారు. మఠాధిపతిని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి, అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మనందం, చింతలపూడి వీరయ్య, చోడా వెంకటసుబ్బారావు, సత్తెనపల్లి శ్రీశైలం, బోగోలు శ్రీనివాసరావు దుశ్శాలువాతో సత్కరించారు.

అభినందన సంచిక ఆవిష్కరణ



అభినందన సంచిక ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరంలో విశిష్ట సేవలు అందించిన మాజీ రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు సేవలపై శనివారం స్థానిక గీతా మందిరంలో అభినందన సంచిక ఆవిష్కరించారు. శ్రీనివాసరావును రోటరీ క్లబ్, వివిధ ప్రజాసంఘాల నేతలు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రజరర్ కోల్లా భువనేశ్వరీ, లెవీ ప్రసాద్, రుద్రయ్య, దేవపాలన, బీవీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1339 గ్రూపులకు రూ. 2.10 కోట్లు సున్నా వడ్డీ

బల్లికురవ: ప్రభుత్వం మండలంలోని 1339 పొదుపు గ్రూపులకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.2.10 కోట్లు లోను ఖాతాలకు జమచేసిందని వైఎస్సార్ కేపీ ఏపీఎం డీ. సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం పొదుపుగ్రూపు ఖాతాలకు జమచేశారని ఏపీఎం తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుతో ఉపయోగాలు

బల్లికురవ: ఖరీఫ్‌లో పంటలను సాగుచేసిన రైతులంతా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ పొలం పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో ఆర్బీకేలోని వీఏఏలను సంప్రదించాలన్నారు. పొలం వద్దకు వెళ్లి పంటను పరిశీలించి ఈ–క్రాప్ నమోదు చేస్తారని చెప్పారు. దీని నమోదుతో పంట ఉత్పత్తులను అమ్ముకోవడంతోపాటు విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చని కుమారి వివరించారు.

మహిళా పోలీసును పరామర్శించిన ఎమ్మెల్సీ

చీరాల: వేటపాలెం మండలం రామన్నపేట పంచాయితీ వద్ద ఇటీవల జరిగిన రెండువర్గాల ఘర్షణ సమయంలో బందోబస్తు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ సునీతకు తలకు గాయమైన సంగతి తెలిసిందే. చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళా కానిస్టేబుల్ సునీతను ఎమ్మెల్సీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లుకు సూచించారు. అలానే మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళా కానిస్టేబుల్‌ను పరామర్శించారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, అధిక శ్రావణ మాసం, ఆరుద్ర నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంటల నుంచి 1.30 గంటల వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఎస్పీని కలిసిన ఆమంచి

బాపట్ల టౌన్: వేటపాలెం ఎస్సై గుడిపల్లి సురేష్ పనితీరుపై విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ శనివారం ఎస్పీ వకుల్ జిందాల్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఎస్పీతో భేటి అనంతరం ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఆమంచి విలేకరులతో మాట్లాడారు. ఎస్సై చట్టవ్యతిరేక, చట్ట విరుద్ధమైన అక్రమాలను ప్రోత్సహిస్తూ, పోలీసు శాఖకు చెడ్డపేరు తీసుకు వస్తున్నారన్నారు. అదేవిధంగా రామన్నపేట పంచాయతీ పరిధిలో వార్డు మెంబర్ల ఎన్నికల నామినేషన్ విషయంలో తలెత్తిన వివాదంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పీ మహేష్ ఒక వైపే పనిచేశారని, అడిషనల్ ఎస్పీ తీరును, చీరాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసి వివరిస్తామన్నారు.

కొడవలివారిపాలెంలో నా మట్టి–నా దేశం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, విద్యార్థులు

కొడవలివారిపాలెం (కారంచేడు): నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని కొడవలివారిపాలెంలో సర్పంచ్ కొడాలి మోహన్‌కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. శనివారం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. 'నా మట్టి–నా దేశం' వీరులకు వందనం వంటి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంతో ప్రజల్లో అవగాహన పెరుగుతుందని అతిథులు అన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎన్ ప్రదీప్‌కుమార్, కార్యదర్శి జయప్రకాష్, వీఆర్‌ఓ ఎస్‌వీ రామారావు, హైస్కూల్ పీఈటీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబానికి ఆర్థిక సాయం



ఉపాధ్యాయుడి భార్యకు నగదు సాయమందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల మృతి చెందిన యర్లపాటి రామమూర్తి కుటుంబానికి రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయమందించారు. పర్చూరు ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడి పనిచేశారన్నారు. కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి సాయమందించాలనే లక్ష్యంతో పూర్వ విద్యార్థుల నుంచి రోటరీ సభ్యుడు పాటోలు వెంకటేశ్వర్లు, రోటరీ కమ్యూనిటీ క్రాఫ్ట్ అధ్యక్షుడు పొట్రు రాఘవయ్య రూ 1.25 లక్షలు సమీకరించారు. నగదును క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉపాధ్యాయుడి భార్య తుర్లపాటి దుర్గాంబికకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు తేళ్ల రమేష్ చంద్ర, కోమటి ఆంజనేయులు, కొల్లా కొండల రాయుడు, మున్నంగి వెంకట సుబ్బయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్చూరు (చినగంజాం): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాతో పాఠశాల నుంచి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. బొమ్మల సెంటర్‌లో జాతీయ గీతాన్ని ఆలపించిన దేశభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే తంబి జోసెఫ్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

చీరాల అర్బన్: అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని న్యాయవాది హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ స్థానిక వాడరేవు రోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద పేదలకు, రిక్షా కార్మికులకు అల్పాహారాన్ని అందించారు. ముందుగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చుండూరి కృష్ణమూర్తి, కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, వెంకటేశ్వరరావు, సంకా చంద్రమౌళి, అన్నంరాజు సుబ్బారావు, మంతెన మణిబాబు, భాగి కృష్ణమూర్తి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అల్పాహారాన్ని అందిస్తున్న హేమంత్‌కుమార్

మహిళల ఆరోగ్యానికి మరింత భద్రత

- మహిళలకు ప్రత్యేకంగా జిమ్
- రూ. 20 లక్షల మున్సిపల్ నిధుల మంజూరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

చీరాల రూరల్: అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళల కోసం మున్సిపల్ అధికారులు వారి ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల ఆరోగ్యానికి మరింత భద్రత పెరగనుంది. నిత్యం రకరకాల పనులతో, ఉద్యోగ బాధ్యతలతో అలసి సొలసిపోయే మహిళా మణుల కోసం స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ఆదేశాలతో ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేసేందుకు సమాయత్తమయ్యారు. అందుకు ప్రత్యేకంగా మున్సిపల్ నిధుల నుంచి రూ. 20 లక్షలు కేటాయించారు. జిమ్‌కు సంబంధించిన పనులను సంబంధిత కాంట్రాక్టర్ వేగవంతంగా చేయిస్తున్నారు. మరో నెల రోజులలో పనులను పూర్తిచేసి జిమ్‌ను వినియోగంలోనికి తీసుకువస్తామని మున్సిపల్ డీఈ ఏసయ్య చెబుతున్నారు.

రూ. 20, లక్షలతో ఓపెన్ జిమ్..

మహిళ కోసం ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు రూ. 15 లక్షలు మున్సిపల్ నిధులను కేటాయించారు. వాటిలో రూ. 10 లక్షలతో మంచి నాణ్యతతో కూడిన వ్యాయామ పరికరాలు కొనుగోలు చేసేందుకు వెచ్చించగా మరో రూ. 5 లక్షలు జిమ్ పరికరాలను బిగించేందుకు ఓపెన్ షెడ్ నిర్మాణానికి వినియోగించనున్నారు. ప్రస్తుతం ఇదే క్రీడా మైదానంలో పురుషుల కోసం గతంలో మున్సిపల్ అధికారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఆ వ్యాయామ శాల నిత్యం సందర్శకులతో కళకళలాడుతుంది. అయితే పురుషులతో పాటు మహిళలు కూడా అదే జిమ్‌లో వ్యాయామాలు చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణలు విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మహిళల వ్యాయామ శాల నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. చీరాలలో ప్రైవేటు జిమ్‌లు ఐదారు వరకు ఉన్నాయి. ఆయా జిమ్‌లలో వ్యాయామాలు చేసుకోవాలంటే ఒక్కొంటికి నెలకు రూ. 500 నుంచి రూ. 1,000 వరకు నిర్వాహకులకు చెల్లించాల్సిందే. అదే ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేస్తున్న ఈ జిమ్‌లో అయితే నెలకు రూ. 100 మాత్రమే వసూలు చేస్తారు. మహిళలకు వ్యాయామాలు చేయించేందుకు ప్రత్యేకంగా మహిళా ట్రైనర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా అధికారులు చెప్తున్నారు. మొత్తం మీద మహిళల ఆరోగ్యానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారనడానికి ఈ వ్యాయామ శాలే నిదర్శనంగా కనబడుతుంది.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

రెండు నెలల్లో పూర్తి చేస్తాం..



మహిళ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న జిమ్‌ను రెండు నెలల్లో పూర్తిచేస్తాం. జిమ్ ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ నిధుల నుంచి కేటాయించాం. నిత్యం బిజీగా ఉండే యాంత్రిక జీవనంలో వ్యాయామాలు చేస్తే కొంతమేరా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

– ఏసయ్య, మున్సిపల్ డీఈ

ఎంతో ఆనందంగా ఉంది..



మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాయామశాల ఏర్పాటు చేయడం ఎంతో మంచిపరిణామం. నిత్యం ఉద్యోగాలు, ఇంటి పనులు చేయడం ద్వారా మహిళలలో ఒత్తిడి, మానసిక ఆందోళనలు పెరిగే అవకాశం ఉంది. కనుక మహిళలు ప్రతిరోజు వ్యాయామాలు చేయడం ద్వారా పని ఒత్తిడిని తగ్గించుకోవచ్చు, అంతేకాకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు. మున్సిపల్ అధికారులకు, ఎమ్మెల్యే బలరామ్‌కు మహిళల తరపున ప్రత్యేకంగా అభినందనలు.

– ఇస్తర్ల సుభాషిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు